నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 5 జూలై 2024 | ADILABAD NIRMAL

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం..

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, జూలై 4 : నిర్మల్ జిల్లాను రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపడం వల్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని నిత్యం పలు చోట్ల వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో జనవరి నుంచి జూలై వరకు.. 49 మైనర్ డ్రైవింగ్ కేసులు, 7,169 ర్యాష్ డ్రైవింగ్, 2,385 డ్రంక్ అండ్ డ్రైవ్, 456 రాంగ్ సైడ్ డ్రైవింగ్, 490 నంబర్ ప్లేట్ లేనివి, 2164 ట్రిబుల్ రైడింగ్ కింద కేసులు నమోదైనట్లు తెలిపారు.

పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

అంపశయ్యపై అన్నదాతలు

ఈ నెల 2వ తేదీన ఆత్మహత్య చేసుకున్న రైతు ఆర్క సంతోష్(ఫైల్)

- వరుసగా బలిపీఠ మెక్కుతున్న రైతులు
- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఆరు నెలల్లో ఎనిమిది మంది రైతుల ఆత్మహత్య

గత ఆరు నెలల్లో ఆత్మహత్యకు పాల్పడ్డ రైతులు..

- 2023 డిసెంబర్ 11న దిలావర్‌పూర్ మండలంలోని మాడేగాం గ్రామానికి చెందిన భీమేశ్(32).
- 2024 జనవరి 13న పెంబి మండలంలోని చందూనాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్(29).
- 2024 జనవరి 24న పెంబి మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ గోవింద్.
- 2024 మార్చి 18న తానూర్ మండలంలోని దౌలతాబాద్ గ్రామానికి చెందిన రాజుల వెంకన్న(50).
- 2024 ఏప్రిల్ 25న తానూర్ గ్రామానికి చెందిన పోశెట్టి.
- 2024 జూన్ 28న నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కోటగిరి గంగయ్య(49).
- 2024 జూన్ 28న కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన పసుపుల నర్సయ్య(47).
- 2024 జూలై 2న పెంబి మండలంలోని యాపల్ గూడ గ్రామానికి చెందిన ఆర్క సంతోష్ (28).

నిర్మల్, జూలై 4(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేసిన అప్పులు తీర్చలేక, సాగుకు పెట్టుబడి లేక ఆర్థిక భారంతో చితికిపోతున్నారు. అయితే ఈ ఆర్థిక భారాన్ని మోయలేని కొంతమంది రైతులు చేసేదేమి లేక తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. దీంతో వారి కుటుంబాలు కుప్పకూలుతున్నాయి. ఇంటి పెద్ద దిక్కు అకాల మరణం చెందడంతో ఆ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో ఇప్పటివరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. స్వల్పకాలంలోనే ఇంత పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు వీరి వైపు దృష్టి కేంద్రీకరించలేదు. తాజాగా పెంబి మండలంలోని యాపల్ గూడ గ్రామానికి చెందిన యువరైతు ఆర్క సంతోష్ ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న ఎకరం భూమితోపాటు ఇతరులకు చెందిన మరో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పత్తి వేశాడు. అయితే సకాలంలో వర్షాలు కురిసినప్పటికీ పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందాడు. అప్పులు చేసి కొన్న పత్తి విత్తనాలు నకిలీవని తేలడమే కాకుండా, భూమిలో వేసిన ఆ విత్తనాలన్నీ ఎండిపోవడంతో ఆయన గుండె భారమైంది. విత్తనాలు, ఎరువుల కోసుగోలుతోపాటు, ఇతర వ్యవసాయ పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి తలెత్తడంతో పెట్టుబడి నష్టపోయానని తీవ్ర మనస్తాపం చెందాడు. పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నది. అలాగే ఇటీవలే కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన మరోరైతు పసుపుల నర్సయ్య(47) కూడా అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఎనిమిది మంది ఆత్మహత్య చేసుకున్నా ఈ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టయినా లేదు. ఇప్పటికైనా రైతు సమస్యలపై దృష్టి సారించి సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించి, రుణమాఫీని కూడా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజానేతకు శుభాకాంక్షల వెల్లువ

రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తూ..

- ఘనంగా మాజీ మంత్రి రామన్న పుట్టిన రోజు వేడుకలు
- రక్తదాన శిబిరం, అన్నదానం, కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

ఆదిలాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తన పుట్టిన రోజును పురస్కరించుకుని రామన్న ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎన్టీయూ భవన్‌లో జరిగిన వేడుకల్లో అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. తమ అభిమాన నేతకు పుష్పగుచ్చాలు, శాలువలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. మాజీ మంత్రి రామన్న రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, వీధి వ్యాపారులకు గొడుగులు అందించారు. మున్సిపల్ కార్మికులకు రేయిన్ కోట్లు పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్, కేటీఆర్

గులాబీ బాస్ కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు జోగు రామన్నకు ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్ కృష్ణారావు, వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి జిల్లా నుంచి నాయకులు, అభిమానులు తరలివచ్చి రామన్న జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. అభిమానుల మధ్య తమ పుట్టిన రోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని రామన్న తెలిపారు. ప్రజలు ఆశీర్వాదం ఎప్పటికీ ఉండాలని ఆకాంక్షించారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారికి రుణపడి ఉంటానన్నారు.

రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తూ..

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, జూలై 4 : సమగ్ర గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ రాజర్షి షా ఉపాధ్యాయులకు సూచించారు. జామడ గిరిజన సైన్స్ ఆదర్శ పాఠశాలను గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి సందర్శించారు. పరిసరాలు, వసతి, భోజనశాల, కిచెన్‌గార్డెన్‌లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని వడ్డించాలన్నారు. పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ ఆడే విశ్వనాథ్ ఉన్నారు.

పిల్లల్లో పఠన నైపుణ్యతను పెంచాలి : కలెక్టర్

ప్రాథమిక దశలో విద్యను అభ్యసించే పిల్లల్లో పఠన నైపుణ్యతను పెంచాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నీతి అయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూం టూ రీడ్ ఇండియా ట్రస్ట్ సంస్థ రూపొందించిన డికోడబుల్ టెక్ట్స్ వికాసం 1,2 పుస్తకాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాపెల్లి ఆశన్న, ఏఎంవో శ్రీకాంత్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం రాధాకృష్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, క్లస్టర్ కో-ఆర్డినేటర్ అజీత్ రాజ్ పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకుపై కేంద్రం స్పందించపోవడం విడ్డూరం

పాఠశాలలను బంద్ చేయిస్తున్న జేఏసీ నాయకులు

ఎదులాపురం, జూలై 4 : నీట్ పేపర్ లీకేజీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించపోవడం విడ్డూరమని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు బంద్ నిర్వహించాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్టీఏ తప్పు చేసింది కాబట్టి ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోద్‌కుమార్‌ను తొలిగించారని గుర్తు చేశారు. అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ నీట్ అంశంపై నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నీట్ సమస్యపై సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదన్నారు. సీబీఐపై నమ్మకం ఎవరికి లేదని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి సమక్షంలో విచారణ జరిపించాలన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాడవి గణేశ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కొట్నాక్ సక్కు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం అరుణ్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేశ్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిది

నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్ అర్బన్, జూలై 4 : దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిదని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య ముఖ్య భూమిక పోశించారని గుర్తు చేశారు. గొప్ప త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని కొనియాడారు. ప్రభుత్వాలు మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వర్‌గౌడ్, సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి గంగాధర్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, సంఘ నాయకులు రాజేశ్వర్, సట్వాజీ, సంగారి శ్రీనివాస్, సాయినాథ్, కామాజీ, భోజన్న, సాయినాథ్, శ్రీనివాస్, తదితతరులు పాల్గొన్నారు.

కాడెద్దుల కొరత.. మోటార్ బైక్‌తో దౌర..

బజార్‌హత్నూర్, జూలై 4 : ఆధునిక కాలం లో ఎడ్లు కనుమరుగవుతున్నాయి. ఎడ్లజతకు అధిక ధర అవుతుండడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. మెదడుకు పదునుపెట్టి వినూత్నంగా ఆలోచిస్తూ యంత్రసాయాన్ని ఉపయోగించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని భూతాయి గ్రామానికి చెందిన రవి వినూత్నంగా ఆలోచించాడు. తనకున్న నాలుగెకరాల భూమిలో సోయా వేశాడు. కలుపు తీయడానకి ఎడ్లజత దొరుకకపోవడంతో పాటు కూలీ ధరలు కూడా అధికంగా కావడంతో సోదరులు సంతోష్, రవితో కలిసి తనకున్న మోటార్ సైకిల్‌కు డౌరకట్టి సోయా చేనులో కలుపు తీసే కార్యాక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు లీటర్ల పెట్రోల్‌తోనే కలుపు పూర్తయిందని తెలిపాడు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

నిర్మల్ జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి

మాట్లాడుతున్న నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

నిర్మల్ అర్బన్, జూలై 4 : అందరి సహకారంతోనే నిర్మల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత జడ్పీటీసీలు భవిష్యత్‌లో మరిన్ని రాజకీయ పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అంతకుముందు పలువురు జడ్పీటీసీలు మాట్లాడుతూ.. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చామని, ఐదేండ్లలో చాలా నేర్చుకున్నామని అన్నారు. ఇక్కడ జడ్పీ సీఈవో గోవింద్, డిప్యూటీ సీఈవో శంకర్, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, సీనియర్ నాయకులు రాం కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మొక్క నాటుతున్న ఎస్పీ, సిబ్బంది

జైనథ్(బేల), జూలై 4 బేల పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ గౌష్ ఆలం తనిఖీ చేశారు. ఎస్పీకి పోలీసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటారు. ప్రతి రోజు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలన్నారు. బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. సమస్యలను సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్టేషన్ పరంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కనకే జీవన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ బేసిక్ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలి..

ఇంద్రవెల్లి పీహెచ్‌సీ ఎదుట బైఠాయింపు

ఇంద్రవెల్లి పీహెచ్‌సీ ఎదుట బైఠాయించిన కాంట్రాక్ట్ బేసిక్ ఏఎన్ఎంలు

ఇంద్రవెల్లి, జూలై 4 : ప్రభుత్వ పీహెచ్‌సీల్లో కాంట్రాక్ట్ బేసిక్ విధానంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ బేసిక్, సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యూలర్ చేయాలని సెకండ్ ఏఎన్ఎంల సంఘం ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోప్పల విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లి పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ, సెకండ్ ఏఎన్ఎంల సంఘం, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏండ్ల నుంచి రెగ్యూలర్ ఏఎన్ఎంలతో సమానంగా పని చేస్తున్నారని, 4 వేల రెగ్యూలర్ పోస్టులకు నోటిఫికేషన్ వేయలన్నారు. కనీస బేసిక్ పేతోపాటు ఏరియర్స్‌ను కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సముద్ర, లక్ష్మి, అరుణ, చెంపబాయి, నిర్మల పాల్గొన్నారు.

ఒకే కాన్పులో దూడ, కంక

భైంసా, జూలై 4 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన రైతు తిప్పోల్ల రాములుకు చెందిన జెర్సీ ఆవు ఒకే కాన్పులో ఒక దూడ, ఒక కంకకు జన్మనిచ్చింది. సర్వసాధారణంగా జెర్సీ ఆవు ఒకే దానికి జన్మనిస్తుంది. కానీ.. ఈ జెర్సీ ఆవు రెండింటికి జన్మనివ్వడంతో గ్రామస్తులు తరలివచ్చి చూశారు.

ఒకే కాన్పులో దూడ, కంకకు జన్మనిచ్చిన జెర్సీ ఆవు

క్రీడా, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బాసర, జూలై 4 : ఆర్జీయూకేటీలో క్రీడా, దివ్యాంగుల కోట విద్యార్థుల ధ్రువపత్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. ఆర్జీయూకేటీలో ఆరేండ్ల సమీకృత విద్యా విధానం అభ్యసించడానికి షెడ్యూల్ ప్రకారం క్రీడ, దివ్యాంగుల కోట విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం అర్హుల జాబితాను విడుదల చేస్తామన్నారు. మొదటి దశ కౌన్సెలింగ్ ఈనెల 8, 9, 10 తేదీల్లో ఉన్నాయని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కన్వీనర్లు పావని, దత్తు, అడ్మిషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.